'వందేభారత్'కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 9 : నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య కొత్తగా ప్రారంభించబోయే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే జీఎంకు లేఖలు రాశారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య ఈ నెల 15 నుంచి ప్రారంభమవనున్న వందేభారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ తప్పనిసరిగా ఉండాలని, ఇక్కడ అనేక పరిశ్రమలు, బొగ్గు గనులు ఉండడం, ఇక్కడ నుంచి నాగ్‌పూర్, సికింద్రాబాద్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటాని పేర్కొన్నారు. మంచిర్యాలతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపుగా మూడు లక్షలకు పైగా జనాభా ఉందని, ప్రజల అవసరాలు, రద్దీని దృష్టిలో పెట్టుకొని మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

కెరమెరి, సెప్టెంబర్ 9 : ఏజెన్సీలో ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం ఆదివాసీ భవన్‌లో సోమవారం గిరిజనేతరులతో ఆదివాసీ సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏజెన్సీలో ఉన్న 1/70, పీసా చట్టాలను అందరూ పాటిస్తూ ఆదివాసులు, మహిళలపై దాడులకు పాల్పడకుండా అన్ని వర్గాల కులపెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే సహించేది లేదని, ప్రతి ఒక్కరూ సోదరభావాన్ని అలవర్చుకుంటూ శాంతియుత వాతావరణంలో జీవనం సాగేలా చూడాలని తెలిపారు. ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్ కుమార్, పెందోర్ మోతీరాం, కోవ ఇందిరా, ఆనంద్‌రావ్, మడావి భరత్ భూషణ్, కనక ప్రభాకర్, భీంరావ్, జగన్నాథ్‌రావ్, రాజేశ్వర్, అంబారావ్, మాజీ వైస్ ఎంపీపీ అబూల్ కలాం, గిరిజనేతర నాయకులు ఎల్లప్ప, జగన్, రామారావ్, యూనుస్, ఏజాజ్, రామకృష్ణ, సోనేరావ్, కోట్రంగే తిరుపతి, కంబాల వినేశ్ పాల్గొన్నారు.

అర్జీలపై తగు చర్యలు తీసుకుంటాం

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 9 : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బెజ్జూర్ మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన దరి సురేశ్, చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన దుర్గం శంకర్.. బెజ్జూర్ ప్రాథమిక సహకార సంఘంలో రుణం పొందకపోయినా తీసుకున్నట్లుగా చూపుతున్నదని, విచారణ జరిపించాలని అర్జీ పెట్టుకున్నారు. కౌటాల మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన దహగాంకార్ హీరామన్.. తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసతో చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన నికాడి లక్ష్మీబాయి.. వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ లో నమోదు చేసి పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో 55 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకొని ఉన్నామని, కొందరు అక్రమంగా పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అలాగే పలువురు తమ సమస్యపై అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

నస్పూర్, సెప్టెంబర్ 9 : మంచిర్యాల కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో సమస్యల పరిష్కారంపై ఆర్జీదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. జైపూర్, నస్పూర్, కోటపల్లి, భీమిని, జన్నారం, దండేపల్లి తదితర మండలాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

జన్నారం, సెప్టెంబర్ 9 : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో గల చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల వివరాలు ఇవ్వాలని మండల చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి చైర్మన్ కలమల విజయధర్మ ఆధ్వర్యంలో ప్రజావాణిలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. చెరువుకు సంబంధించిన పత్రాలతోపాటు, చెరువుల మ్యాప్‌లను ఇచ్చి, వాటిని పరిరక్షించేందుకు సహకరించాలని కోరారు.

భీమారం, సెప్టెంబర్ 9 : గణేశ్ నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలని గణేశ్ మండలి నిర్వాహకులు భీమారంలో జరిగిన ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు పారిశుధ్యం, ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేమనపల్లి, సెప్టెంబర్ 9 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ తహసీల్దార్ రమేశ్, పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సుజాత, ఇరిగేషన్ అధికారి రాజలింగు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు

నస్పూర్, సెప్టెంబర్ 9 : 2024-25 విద్యా సంవత్సరంలో దివ్యాంగ విద్యార్థులు పోస్టుమెట్రిక్, టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదువుతున్న వారు అక్టోబర్ 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అలాగే దీన దయాల్ వికలాంగ పునరావాస పథకం, సమీకృత వృద్ధుల సంక్షేమ పథకాల్లో భాగంగా బాధితులకు పునరావాసం కల్పించే కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించేందుకు ఎన్జీవో సంస్థలు 16లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

28న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, సెప్టెంబర్ 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కోర్టు భవన సముదాయంలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించి, తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

జన్నారం, సెప్టెంబర్ 9 : జన్నారం మండల కేంద్రం పొనకల్ అంబేద్కర్ చౌక్ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన గల ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ వ్యాపారి రాంసింగ్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ రాజవర్దన్ తతెలిపారు. రాంసింగ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి మంచిర్యాలకు వెళ్లాడు. రాత్రి ఇంట్లోకి చోరబడ్డ దుండగులు బీరువా తాళాలు పగులగొట్టి 4 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ క్లూస్ టీంతో పరిశీలించారు.

చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 9 : పట్టణంలోని కన్నాల బస్తీ ఏరియాలో టీడీపీ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి మణిరామ్ సింగ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. 1994లో టీడీపీ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం 8 గుంటల స్థలం కేటాయించిందని గుర్తు చేశారు. కబ్జాదారులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి గద్దెల నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి, పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు చింతల రమేశ్, నాయకులు గంగాధర్‌గౌడ్, బుల్లు మల్లయ్య, ఓ జీవరత్నం, పీ రాజనర్సు, చిటికెర రాయలింగు, యాదగిరి, దుగుట రవి, ఎండీ హసన్, ఎం రాజయ్య పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంపై సమీక్షా సమావేశం

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 9 : మండలంలో 17న నిర్వహించే గణేశ్ ప్రతిమల నిమజ్జనంపై సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ కమలాకర్, కార్యదర్శి తిరుపతి, మత్స్యకార సంఘం నాయకుడు బామినే పోశం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలో పడి ఒకరు మృతి

సిర్పూర్(టీ)/చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 9 : సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని న్యూకాలనీ సమీపంలో గల నీటి కుంటలో పడి షేక్ హుస్సేన్ (50) మృతిచెందినట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. చెన్నూర్ పట్టణానికి చెందిన హుస్సేన్ సిర్పూర్(టీ)లోని తన సోదరి ఇంటి వద్ద ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో బయటకు వెళ్లి తిరిగి వస్తూ కుంటలో పడిపోయాడు. సోమవారం ఉదయం మృతదేహం కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 9 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షురాలు ఎర్ర కాంత, విజయ, లక్ష్మి, సురేఖ, ఆశక్క పాల్గొన్నారు.

వేతనం అందించాలి

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 9 : సిర్పూర్(టీ) మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 10 నెలల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బహుజన నాయకుడు దుర్గం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పంచాయతీ కార్యదర్శి తిరుపతికి వినతిపత్రం అందజేశారు. కుటుంబపోషణ భారంగా మారిందని, వెంటనే 10 నెలల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

వేమనపల్లి, సెప్టెంబర్ 9 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో సోమవారం పోషణమాసం కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై సూపర్‌వైజర్ సువర్ణ అవగాహన కల్పించారు. అలాగే ఒడ్డుగూడెం, నాగారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు రాణి, అరవింద, మధునక్క తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, సెప్టెంబర్ 9 : మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి సూచించారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో పోషణ మాసం సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోషి, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 9: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే శానిటరీ హెడ్ జవాన్ శ్రీనివాస్ (58) సోమవారం మృతి చెందాడు. ఇటీవల ఆరోగ్య సమస్య కారణంగా మంచిర్యాలలోని ప్రైవేటు దవాఖానలో చేరాడు. కాగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. పర్మినెంట్ కార్మికుడైన శ్రీనివాస్ గతంలో టీపీఎస్ విభాగంలో విధులు నిర్వర్తించి, పదేళ్లుగా హెడ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు.

అందుబాటులో ఉండాలి

తాండూర్, సెప్టెంబర్ 9 : వినాయక మండపాల వద్ద నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ అన్నారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సోమవారం తనిఖీ చేశారు. ఉత్సవాలు ముగిసే వరకు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

నస్పూర్, సెప్టెంబర్ 9 : ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన రచనలు, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కవి అల్లాడి శ్రీనివాస్ అతిథిగా హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు గోపాలకృష్ణ, కనకలక్ష్మి, కరుణాకర్, అరుణ, నవీన్, మధుసూదన్, యాస్మిన్, ఫర్హాన్, మహేశ్‌కుమార్, అంజయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి, సెప్టెంబర్ 9 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ రమేశ్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధూకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సుజాత, లచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి, సెప్టెంబర్ 9 : గుడిరేవు జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకున్నారు. హెచ్ఎంలు రాజశేఖర్, బొలిశెట్టి బుచ్చన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

జైపూర్, సెప్టెంబర్ 9 : జైపూర్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతితో పాటు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 9 : కాగజ్‌నగర్ మండలం రాస్పల్లి జడ్పీ సెకండరీ పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట, సెప్టెంబర్ 9 : దేవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సామాజిక చైతన్య వేదిక నాయకులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సురేశ్ బాబు, ఉపాధ్యాయులు అమ్జద్ పాషా, లచ్చన్న, రమణయ్య, సులోచన, పద్మ, కుమారి, రజిత, రాజేశ్ పాల్గొన్నారు.

వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..

దండేపల్లి : గుడిరేవు పాఠశాలలో..

జైపూర్ తహసీల్ కార్యాలయంలో..

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 9 : మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌ను సోమవారం సందర్శించి, వార్డులను పరిశీలించారు. రోగులతో ముచ్చటించారు. వారికి అందుతున్న వైద్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారం క్రితం జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా మాతా శిశు సంరక్షణ కేంద్రానికి ముంపు ప్రమాదం ఉన్నందున బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులను ముందస్తుగా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఇక్కడి వైద్యులు వారికి సరైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో సిబ్బంది కొరత ఉందని, సరైన వైద్య పరికరాలు లేవని, భవనం శిథిలావస్థలో ఉన్నదని పేర్కొన్నారు. మంచిర్యాలకు నూతన ప్రభుత్వ దవాఖాన భవనం మంజూరైందని, దసరా వరకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్ చంద్రారెడ్డి, ఆర్ఎంవోలు శీమన్నారాయణ, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కన్నెపల్లి, సెప్టెంబర్ 9 : కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కన్నెపల్లి, భీమిని మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో గంగామోహన్, నాయకులు మాధవరపు నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ ఆర్ సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

నెన్నెల, సెప్టెంబర్ 9 : నెన్నెల ఎంపీడీవో కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దేవేందర్, ఏపీఎం విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్, నాయకులు గట్టు మల్లేశ్, రమేశ్, శిరీష్, తోట శ్రీనివాస్, చీర్ల కిషన్ రెడ్డి, గట్టు బానేశ్, శంకరయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన గౌడ సంఘం నాయకులు



బొమ్మ మహేశ్‌కుమార్‌తో గౌడ సంఘం నాయకులు

రెబ్బెన, సెప్టెంబర్ 9 : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మోడెం చిరంజీవిగౌడ్, మడ్డి శ్రీనివాస్‌గౌడ్, అన్న పూర్ణ మురళీగౌడ్ తదితరులు ఉన్నారు.

కొలాం గ్రామ కమిటీ ఎన్నిక

కాసిపేట, సెప్టెంబర్ 9 : కాసిపేట మండలం దేవాపూర్ పరిధిలోని పెద్దాపూర్, కొలంగూడ, పావుగూడ, జెండాగూడెం, గూడేల్లోని కొలం ఆదివాసీ గిరిజనులు తమ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెండాగూడెంకు చెందిన టేకం భీంరావ్, ప్రధాన కార్యదర్శిగా పెద్దాపూర్ కొలంగూడకు చెందిన ఆత్రం భీంరావ్, గౌరవాధ్యక్షుడిగా పావుగూడకు చెందిన కొడప భీంరావ్, కోశాధికారిగా టేకం భగవంత్‌రావ్, కోశాధికారిగా టేకం భీంరావ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా నాయకులు ఆత్రం మహేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర వైద్యసేవలకు చర్యలు

అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో హరిశ్‌రాజ్, వైద్య బృందం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 9 : జిల్లాలో సత్వర వైద్యసేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ అన్నారు. మంచిర్యాల, నస్పూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటింటా తిరిగేందుకు జిల్లాలో 72 వైద్య బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ బృందంలో ఒక స్టాఫ్ నర్సు, ఆరోగ్య కార్యకర్త ఉంటారని, ప్రతీ బృందానికి ఒక పర్యవేక్షకుడిని నియమించామని తెలిపారు. ఈ బృందం రోజుకు 50 నుంచి 100 వరకు ఇళ్లలో తిరిగి, వివరాలు సేకరిస్తుందని, జ్వరం లక్షణాలు ఉంటే పరీక్ష చేసి, ఆర్‌డీ కిట్ల ద్వారా అక్కడే పరీక్షలు నిర్వహించి వైద్యనిర్ధారణ అనంతరం అక్కడే మందులను అందజేస్తుందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హరికృష్ణ, వైద్యులు ప్రసాద్, అనిత, ఫయాజ్, అనిల్, శివప్రతాప్, నామ్‌దేవ్, అల్లాడి శ్రీనివాస్, బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాగులో పడి ఒకరి మృతి

మృతదేహాన్ని సిబ్బందితో బయటకు తీసుకువస్తున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రి, సెప్టెంబర్ 9 : మందమర్ర పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన గాదె శ్రీనివాస్ (55) మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పాలవాగులో పడి మృతిచెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. శ్రీనివాస్ తాపీమేస్త్రీ పనిచేసేవాడు. కొద్దిరోజులు పనిమానేసి, మద్యానికి బానిసయ్యాడు. పాలవాగు పక్కన గల దారి మైసమ్మ ఆలయం వద్ద ఉంటూ ఆలయాన్ని శుభ్రం చేస్తూ ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్, తిరిగి రాలేదు. సోమవారం ఉదయం భార్య రమాదేవి ఆలయం వద్దకు వెళ్లి, చూడగా, గుడి పక్కన చెప్పులు, గొడుగు కనిపించాయి. వాగులో పరిశీలించగా, మృత దేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా, మృత దేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నటుల ఎస్ఐ తెలిపారు. కాగా, మృతదేహాన్ని వాగు నుంచి తీసేందుకు ఎవరూ ముందుకురాలేదు. ఎస్ఐ రాజశేఖర్.. ఏఎస్ఐ మాజీద్, సిబ్బందితో కలసి మృతదేహాన్ని బయటకు తెచ్చారు. మానవత్వాన్ని చాటిన ఎస్ఐని పలువురు అభినందించారు. కానిస్టే బుకుల గోపాల్, శ్రావణ్, సురేందర్, గోపికృష్ణ ఉన్నారు.

సేవాలాల్ సేన ఆవిర్భావ వేడుకలు

భీమారం, సెప్టెంబర్ 9 : సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భీమారం మండలంలోని బూరుగుపల్లిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు ధరావత్ శంకర్, మండల నాయకులు భూక్యా మోతీలాల్, లక్ష్మణ్, రాములు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ సర్వే ఎందుకు చేస్తున్నారు

- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను నిలదీసిన సుంకరిపల్లి కాలనీవాసులు

భీమారం, సెప్టెంబర